www.ninadam.in

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం


EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

మంగళవారం ఏప్రిల్ 14 2026

ninadam.in

## నియోజకవర్గాల పునర్విభజన...
## 543 నుంచి 850కి పెరగనున్న లోక్ సభ స్థానాలు




2

## వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో
# మహిళా రిజర్వేషన్లు

- చట్టసభల్లో వారి ఉనికి చాటేందుకు అవకాశం
- దేశ మహిళలకు లేఖలో ప్రధాని మోడీ వెల్లడి

2




## ముస్లింలను ఓట్ల కోసం వాడుకుని వదిలేయడం
# మమతాకు అలవాటు

- అసదుద్దీన్ ఒవైసీ



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (నినాదం):**

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ బలపడటానికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీనే కారణమని, ముస్లింలను ఓట్ల కోసం వాడుకుని వదిలేసే (యూజ్ అండ్ త్రో) విధానాన్ని ఆమె అనుసరిస్తారని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముస్లిం ఓట్లను చీల్చి బీజేపీకి మేలు చేస్తున్నారనే విమర్శలను ఎదుర్కొంటున్న ఒవైసీ, ఆ మరక తమకు కాదని, మమతాకే అంటుతుందని స్పష్టం చేశారు.


2

# అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం ఘనత కెసిఆర్‌దే

- గురుకులాల్లో రణ మృదంగం మోగుతోంది
- అంబేడ్కర్ జయంతి వేడుకల్లో బిఆర్ఎస్ నేత కెటిఆర్

2



## ఇరాన్‌కు అణు ఆయుధాలు దక్కనివ్వం..
# నావికా దిగ్బంధనం మొదలైంది
## - ట్రంప్

**ఢిల్లీ, , ఏప్రిల్ 14 (నినాదం):**
ఇరాన్‌కు అణు ఆయుధాలు ఎప్పటికీ ఉండబోవని, ఆ దేశాన్ని కట్టడి చేసేందుకు అమెరికా నావికా దళం దిగ్బంధనం కూడా ప్రారంభించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఓవల్ ఆఫీస్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌తో వివాదానికి ప్రధాన కారణం అణు సామర్థ్యమేనని ఆయన స్పష్టం చేశారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవడానికి ఇరాన్ ముందుకు వస్తోందని, అయితే అణుబాంబును వదులుకునే షరతుకు అంగీకరించాల్సిందేనని స్పష్టం చేశారు.

2

# రేపు ఢిల్లీకి వెళుతున్న రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 14 ( నినాదం):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు సాయంత్రం దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ పర్యటన జాతీయ రాజకీయాల్లో, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల దృష్ట్యా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే పునర్విభజన ప్రక్రియలో కేవలం జనాభాను ప్రాతిపదికగా తీసుకుంటే తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని రేవంత్ రెడ్డి ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాకు 50 శాతం,

2

# తెలంగాణలో దళితుల అభ్యున్నతికి పెద్దపీట

## దేశానికి గాంధీ, అంబేడ్కర్ రెండు కళ్లు

- బలమైన దేశంగా ఎదగడానికి బాబా సాహెబ్ కృషి
- దళితబిడ్డలు ఉన్నత పదవుల్లో ఉంటే ఓర్వలేకపోతున్నారు
- ప్రస్తుత డీలిమిటేషన్‌తో తెలంగాణకు తీరని అన్యాయం
- అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సిఎం రేవంత్ రెడ్డి





**హైదరాబాద్,ఏప్రిల్14(నినాదం):**

దేశానికి గాంధీ, అంబేడ్కర్ రెండు కళ్లలాంటి వారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ పాత్ర ఎంత ఉందో.. దేశాభివృద్ధిలో అంబేడ్కర్ పాత్ర అంతే ఉందన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఆ ఇదకదరు మహానుభావులు దేశానికి రెండు కళ్లలాంటి వారని అన్నారు. రక్తం చిందకుండా యుద్ధం గెలవచ్చని గాంధీ నిరూపించారు. బలమైన దేశంగా భారత్ ఎదగడానికి అంబేడ్కర్ కృషి చేశారు. ప్రజల కలలు సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అలాగే తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్రను ఎవరూ మర్చిపోలేరని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇచ్చామ న్నారు. దళిత బిడ్డ బడ్జెట్ ప్రవేశపెడితే

2

## సజ్జనార్ ను కలిసిన మంగ్లీ..
# సుబ్బారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నపం



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (నినాదం):**

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను సినీ గాయని మంగ్లీ కలిశారు. అడ్వకేట్ సుబ్బారావుకు, మంగ్లీకి మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, మైక్రోఫైనాన్స్ స్కామ్ ఆరోపణల నేపథ్యంలో తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలని కోరుతూ మంగ్లీ తాజాగా సీపీ సజ్జనార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మైక్రోఫైనాన్స్ పేరుతో తాను, తన

2



# అంబేడ్కర్‌కు మోడీ నివాళులు

## దేశ నిర్మాణాంలో అంబేడ్కర్ కృషి అపూర్వమని వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 ( నినాదం):**

డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ

2




## అమెరికా-ఇరాన్ సంక్షోభం...
## చమురు మార్కెట్‌లో కల్లోలం..
# భారత్‌పైనా ప్రభావం!


**హైదరాబాద్, ఏప్రిల్ 14 (నినాదం):**

అంతర్జాతీయంగా చమురు మార్కెట్‌లో తీవ్ర సంక్షోభం నెలకొంది. అమెరికా సైన్యం ఇరాన్‌కు చెందిన ఓడరేవులను దిగ్బంధించడంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ చర్యతో ఇరాన్ నుంచి రోజుకు సుమారు 20 లక్షల బ్యారెళ్ల చమురు ఎగుమతులు నిలిచిపోనున్నాయని, ఫలితంగా ప్రపంచ మార్కెట్‌లో సరఫరా తగ్గి పెట్రోలియం ఉత్పత్తుల ధరలు మరింత పెరగనున్నాయని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ నోమురా వెల్లడించిన

2

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు
# మద్దతివ్వండి

## - ఏపీలోని అన్ని పార్టీలకు సీఎం చంద్రబాబు లేఖ



**అమరావతి, ఏప్రిల్ 14 ( నినాదం):**
చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 'నారీ శక్తి వందన్ అధినియం'పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ముందడుగు వేశారు. ఈ చారిత్రక బిల్లుకు సంపూర్ణ మద్దతు కూడగట్టే లక్ష్యంతో ఆయన రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు మంగళవారం లేఖ రాశారు. రాబోయే 2029 ఎన్నికల నుంచే ఈ రిజర్వేషన్లు అమల్లోకి తీసుకురావాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షను అందరూ కలిసికట్టుగా బలపరచాలని తన లేఖలో చంద్రబాబు గట్టిగా విజ్ఞప్తి చేశారు.దఈ



నెల 16న పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోతుందని చంద్రబాబు తన లేఖలో అభిప్రాయపడ్డారు. "మహిళా రిజర్వేషన్ బిల్లుపై విస్తృతంగా చర్చలు జరిగాయి. త్వరితగతిన ఈ చారిత్రక చట్టం అమల్లోకి రావాలన్న ఏకాభిప్రాయం కూడా నాడు వ్యక్తమైంది. ఇందులో భాగంగా 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు కావాలన్న ప్రధాని నరేంద్ర మోదీ గారి ఆకాంక్షకు మనందరం మద్దతు పలుకుదాం" అని ఆయన కోరారు. ఈ అంశం రాజకీయాలకు అతీతమైనదని, దేశ గౌరవానికి

2

## ఇంకా అజ్ఞాతంలో
## కేవలం నలుగురు
# మావోయిస్టులు

గణపతి, సంతోష్,రత్నాబాయి, వార్త శేఖర్

తెలంగాణ పోలీస్ శాఖ వెల్లడి



2

# నాతవరంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు

## స్పీకర్ అయ్యన్న, హోంమంత్రి అని నివాళి



**అనకాపల్లి, ఏప్రిల్ 14 ( నినాదం):**

నాతవరంలో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాతవరం, గొలుగొండ, కేడీ పేట ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాలను నేతలు ప్రారంభించారు. పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకం కింద ఎస్సీ, ఎస్టీ సోలరైజేషన్ పక్రియను స్పీకర్, హోంమంత్రి ప్రారంభించారు. హోం మంత్రిగా ఎలా ఉండాలో అనిత నిరూపించారని, అసెంబ్లీలో కూడా ఆమె ప్రసంగాలు అందరికీ అర్థమయ్యేలా స్పష్టంగా ఉంటాయని స్పీకర్

2

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
EVENING 6 PM
02
డిజిటల్ ఎడిషన్
మంగళవారం ఏప్రిల్ 14 2026
ninadam.in

## వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో

# మహిళా రిజర్వేషన్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 ( నినాదం):**
రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలవుతాయని, దీంతో మన రాజ్యాంగం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ మేరకు ఆయన దేశ మహిళలకు ఓ లేఖ రాసి దాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ప్రస్తుతం పలు రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారు. అదేవిధంగా చట్ట సభల్లోనూ వారి ఉనికిని చాటేందుకే ఈ రిజర్వేషన్ల పక్రియ మొదలుపెట్టాం. పార్లమెంట్‌లో ఏప్రిల్ 16 నుంచి జరగనున్న మూడు రోజుల సమావేశాల్లో 'నారీ శక్తి వందనం అధినియమ్' బిల్లులో సవరణలు ప్రవేశపెడతాం. దీనిపై ఏమాత్రం ఆలస్యం జరిగినా అది భారతదేశ మహిళలకు అన్యాయం చేసినట్టే. 2029 లోక్‌సభ ఎన్నికల సమయానికి మహిళల రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని అంటూ దేశ మహిళలకు రాసిన లేఖలో మోదీ పేర్కొన్నారు. భారతదేశ కుమార్తెలు వారి హక్కుల కోసం జీవితాంతం వేచి చూడటం సబబు కాదు. చట్టసభల్లో వారి గొంతుకను గట్టిగా వినిపించే సమయం వచ్చింది. దీంతో ప్రజాస్వామ్యం కూడా దృఢంగా మారనుంది. జరగబోయే పార్లమెంట్ సమావేశానికి, రాజ్యాంగ సవరణ ఆమోదం కోసం, దేశం నలుమూలలా ఉన్న కోట్లాది మంది మహిళల ఆశీస్సులు కోరుకుంటున్నాను. మీరంతా మీ స్థానిక ఎంపీలకు లేఖ రాసి పార్లమెంట్ సభల్లో పాల్గొనాలని వారిని కోరండి' అని మోదీ ఆ లేఖలో రాసుకొచ్చారు. 2023 పార్లమెంటు సమావేశాల్లో నారీ శక్తి వందనం అధినియమ్' రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టారు. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్లకు సంబంధించిన ఈ బిల్లులో సవరణలు జరుగుతున్నాయి. లోక్‌సభలో 1/3 వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని నిర్ణయించారు. అంటే మొత్తం 816 లోక్‌సభ స్థానాల్లో మహిళలకు దాదాపు 273 సీట్లను కేటాయించేలా చట్టంలో సవరణలు చేయనున్నారు.

## ఇరాన్‌కు అణు ఆయుధాలు దక్కనివ్వం..

# నావికా దిగ్బంధనం మొదలైంది

"ఇరాన్‌కు అణు ఆయుధాలు ఉండకూడదన్నదే మా ప్రధాన ఉద్దేశం. ఈ విషయంలో వాళ్లు అంగీకరించలేదు. కానీ, త్వరలోనే వారు అంగీకరిస్తారని నేను భావిస్తున్నాను. ఒకవేళ ఒప్పుకోకపోతే ఎలాంటి ఒప్పందం ఉండదు" అని ట్రంప్ అన్నారు. చర్చల కోసం ఇరాన్ తమను సంప్రదించిందని, ఒప్పందం చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆయన తెలిపారు. నావికా దిగ్బంధనం ఉదయం 10 గంటలకు ప్రారంభమైందని ట్రంప్ ధ్రువీకరించారు. "ప్రపంచాన్ని ఇరాన్ బ్లాక్‌మెయిల్ చేస్తోంది. దానిని మేము జరగనివ్వం. అందుకే ఈ చర్యలు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దిగ్బంధనం ఇరాన్‌ను చర్చల వైపు మళ్లించడంతో పాటు ప్రపంచ ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి కూడా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. హార్ముజ్ జలసంధిపై అమెరికా ఇంధన అవసరాల కోసం ఆధారపడటం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. "మాకు ఆ జలసంధి అవసరం లేదు. మాకు కావాల్సిన చమురు, గ్యాస్ మా వద్దే ఉన్నాయి. కానీ ప్రపంచానికి అది అవసరం" అని అన్నారు. ఇప్పటికే ఇరాన్ నావికాదళం, వాయుసేన, గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్ వ్యవస్థలు పూర్తిగా నాశనమయ్యాయని ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌కు పరిస్థితులు ఏమాత్రం ఆహ్లాదకరంగా ఉండవని ఆయన హెచ్చరించారు. ఈ దిగ్బంధనం అమలులో ఇతర దేశాలు కూడా తమకు సహకారం అందిస్తాయని ఆఫర్ చేశాయని, చైనా కూడా ఈ సమస్య పరిష్కారం కావాలని కోరుకుంటోందని ట్రంప్ వివరించారు.

## సమ్మె యోచన

# విరమించండి

- మా తలుపులు తెరిచే ఉన్నాయి
- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి



**హైదరాబాద్, ఏప్రిల్ 14 ( నినాదం):**
ఆర్టీసీ పరిరక్షణ – ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామని సంస్థ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సమస్యలు చెప్పుకోవడానికి తమ తలుపులు తెరిచే ఉన్నాయి.. ఎవరైనా వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చునని ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల అంశాలు ప్రభుత్వ పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీ పని చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తమ డిమాండ్ల నెరవేరని పక్షంలో ఏప్రిల్ 22వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ సోమవారం ప్రకటించింది. 21వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు నిలిపి వేస్తామని స్పష్టం చేసింది. 22వ తేదీ తెల్లవారుజాము నుంచి సమ్మెలోకి వెళ్తామని పేర్కొంది. సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు సమావేశమయ్యారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ నేతలు మాట్లాడుతూ.. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఆర్టీసీ సంస్థ నుంచి అధికారులు రాలేదని స్పష్టం చేశారు. అయితే ఆర్టీసీ యాజమాన్యం నుంచి లేఖ మాత్రం వచ్చిందన్నారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిధిలో ఉన్నాయని ఈ సందర్భంగా యాజమాన్యం స్పష్టం చేసిందని చెప్పారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాలకు ఎన్నికలు సహా మరో 30 డిమాండ్లతో సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ నేతలు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పైవిధంగా స్పందించారు.



# తెలంగాణలో దళితుల అభ్యున్నతికి పెద్దపీట

చూడలేకపోతున్నారంటూ విమర్శించారు. గతంలో భట్టి విక్రమార్కకు సీఎల్పీ నేత హోదాను తొలగించేలా కుట్రలు జరిగాయని సీఎం రేవంత్ ఆరోపించారు. ఎస్సీ నాయకుడు స్పీకర్‌గా, ఆర్థిక మంత్రిగా ఉండకూడదా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో ఎనాడైనా డైట్ ఛార్జీలు పెంచారా అని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడితే ఓర్వలేక పోతున్నారంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్తు మారుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక 67వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. 67వేల ఉద్యోగాల్లో 87శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే వచ్చాయని వెల్లడించారు. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల నష్టానికి దారి తీసిందని సీఎం వ్యాఖ్యానించారు. ఆనాడు చేసిన అప్పులు చెల్లిస్తూ.. తప్పులు సరిదిద్దుతూ పాలన కొనసాగిస్తున్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపుపై కేంద్రం గందరగోళం సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 50 శాతం జనాభా ఆధారంగా.. మరో 50 శాతం జీఎస్‌డీపీ ఆధారంగా హైబ్రిడ్ మోడల్‌లో డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం లభించిందని.. కానీ లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. సమాన అవకాశాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడపవచ్చని అంబేడ్కర్ మార్గదర్శనం చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పేదలకు నాణ్యమైన విద్య కోసం గతంలో లేని విధంగా చర్యలు చేపట్టాం. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్ మారుతుంది. తెలంగాణ ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. గతంలో చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల నష్టానికి దారి తీసిందని సీఎం అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయి. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. దక్షిణాదిన కుటుంబ నియంత్రణ వల్ల జనాభా తగ్గి సీట్లు కోల్పోయే పరిస్థితి. కేంద్రం ఆదేశాలు పాటించి జనాభా నియంత్రణ పాటిస్తే నష్టం చేస్తున్నారు. తెలంగాణకు తీరని నష్టంపై అభ్యంతరం లేవనెత్తాం అని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## అమెరికా-ఇరాన్ సంక్షోభం... చమురు మార్కెట్‌లో కల్లోలం..

# భారత్‌పైనా ప్రభావం!

వివరాల ప్రకారం అమెరికా చర్యల ప్రభావం భారత్‌పైనా తీవ్రంగా పడనుంది. ముఖ్యంగా హార్మూజ్ జలసంధిని పూర్తిగా దిగ్బంధిస్తే, భారత్‌కు వచ్చే ఎల్‌పీజీ సరఫరాకు అంతరాయం కలగవచ్చు. గత నెలలోనే భారత్‌కు చెందిన ఎనిమిది ఎల్‌పీజీ ట్యాంకర్లు ఈ జలసంధి గుండా సురక్షితంగా ప్రయాణించాయని నోమురా విశ్లేషకుడు బినీత్ బంకా తెలిపారు. మరోవైపు హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు ఏ నౌక కూడా ఇరాన్‌కు రుసుము (టోల్) చెల్లించరాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. విఫలమైన శాంతి చర్చలు.. 107 డాలర్లకు చేరిన బ్రెంట్ క్రూడ్.. ఈ సంక్షోభ నివారణకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలో పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరిగిన శాంతి చర్చలు విఫలమయ్యాయి. దీంతో సోమవారం బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 107 డాలర్ల గరిష్ఠ స్థాయికి చేరింది. అయితే, మళ్లీ చర్చలు జరగవచ్చన్న ఆశలతో మంగళవారం నాడు క్రూడ్ ధర 100 డాలర్ల దిగువకు చేరింది. చర్చలు విఫలమవడంతో చమురు ధరలపై యుద్ధ భయాల ప్రభావం మరింత పెరగవచ్చని నోమురా అంచనా వేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో సౌదీ అరేబియా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. హార్మూజ్ జలసంధిని తప్పించుకుని, ఎర్ర సముద్రంలోకి తెరుచుకునే తన ఈస్ట్–వెస్ట్ పైప్‌లైన్ ద్వారా చమురు రవాణా సామర్థ్యాన్ని రోజుకు 7 మిలియన్ బ్యారెళ్లకు పెంచుకుంది. దీని ద్వారా మార్చిలో 4.4 మిలియన్ బ్యారెళ్ల ఎగుమతి చేసిన సౌదీ, భవిష్యత్తులో రోజుకు 5 మిలియన్ బ్యారెళ్ల వరకు ఎగుమతి చేసే అవకాశం ఉందని నోమురా పేర్కొంది. ఆశ్చర్యకరంగా ఈ యుద్ధ వాతావరణం ఇరాన్‌కు ఆర్థికంగా లాభం చేకూర్చినట్లు తెలుస్తోంది. మార్చిలో ఇరాన్ చమురు ఆదాయాలు గతేడాదితో పోలిస్తే 36 శాతం పెరిగి 5.7 బిలియన్ డాలర్లకు చేరాయని బంకా అంచనా వేశారు. ఎగుమతులు తగ్గినా, ధరలు పెరగడంతో ఇరాన్ ఆదాయం గణనీయంగా పెరిగింది.

# అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం ఘనత కెసిఆర్‌దే



**హైదరాబాద్, ఏప్రిల్ 14 ( నినాదం):**
బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. పోరాడితే పోయేదేమీ లేదన్న శ్రీశ్రీ చెప్పిన మాట నిజం అయిందని.. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి సంకెళ్లు వేసి బందీ చేసిందని ఆరోపించారు. ఈసారి బందీ చేస్తే సంకెళ్లు బద్దలు కొడతామని పిలుపు ఇచ్చిన వెంటనే విగ్రహాన్ని ఓపెన్ చేశారని వ్యాఖ్యానించారు. అంబేడ్కర్ తత్వం 'బోధించు, సమీకరించు, పోరాడు'తోనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని కేటీఆర్ పేర్కొన్నారు. గురుకులాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గురుకులాల్లో మరణ మృదంగం మోగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకుంటోంది తప్ప.. ఎన్నడూ నిజమైన గౌరవం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత కాలం అంబేడ్కర్‌కు భారతరత్న ఇవ్వలేదన్నారు. అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయకుండా ఆయనను అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. దళిత బంధు లాంటి పథకాలను తీసుకొచ్చిన కలేజా ఉన్న నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో అవకాశాలు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని మాజీ మంత్రి విమర్శించారు. లక్షన్నర కోట్ల కాంట్రాక్టుల్లో 72 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మూసి కాంట్రాక్టు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తారా అని నిలదీశారు. కాంగ్రెస్ మోసాలను రాష్ట్రంలోని ప్రతి దళిత, బీసీ, మైనార్టీ కుటుంబాలకు చేర్చి పోరాడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 20న జగిత్యాలలో జరిగే బహిరంగ సభకు కేసీఆర్ హాజరవుతాని ప్రకటించారు. కాంగ్రెస్ డిక్లరేషన్‌పై బహిరంగ సభలు నిర్వహించేలా ఎ÷–లాన్ చేసుకోవాలని సూచించారు. పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని బీజేపీని డిమాండ్ చేశామని.. అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామని కేటీఆర్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లకు ఏ మాత్రం గౌరవం ఉన్నా స్పందించే వారన్నారు. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే అని.. అంబేడ్కర్ అంటే గిట్టని వారే అని విమర్శించారు. అంబేడ్కర్‌ను కొందరి వాడుగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని.. మహాత్మా గాంధీ లాగే అంబేడ్కర్ అందరి వాడని స్పష్టం చేశారు. 'జై భీమ్, జై కేసీఆర్, జై తెలంగాణ' నినాదాలతో ముందుకు సాగుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వండి

సంబంధించిన విషయమని చంద్రబాబు స్పష్టం చేశారు. "మహిళా రిజర్వేషన్ పై అంతా ఒకే స్వరం వినిపించాలని ఆడబిడ్డల తరుపున బాధ్యతతో ఈ లేఖ రాస్తున్నాను. మన ఇంటి ఆడబిడ్డలను, మన దేశ మహిళలను గౌరవించుకునే ఈ అవకాశాన్ని మనందరం అదృష్టంగా భావిద్దాం. ఈ పవిత్ర ఘట్టంలో భాగస్వామి అయ్యే సందర్భాన్ని ఎవరూ వదులుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ప్రతీ పార్టీ, ప్రతీ ఎంపీ ఈ చారిత్రాత్మక నిర్ణయంలో తమదైన ముద్ర వేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ప్రభుత్వంలో, పరిపాలనలో, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుందని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. 'నారీ శక్తి వందన్ అధినియమ్' కేవలం మహిళా సాధికారతకే కాకుండా, యావత్ దేశ ఉన్నతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. భరతమాతను పూజించే మన దేశంలో, నారీ శక్తికి వందనం పలికే ఈ గొప్ప క్షణాలకు 140 కోట్ల మంది భారతీయులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని చేకూర్చడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రధాని మోదీని, కేంద్ర ప్రభుత్వాన్ని సమష్టిగా బలపరచాలని చంద్రబాబు తన లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

## ఇంకా అజ్ఞాతంలో కేవలం నలుగురు మావోయిస్టులు

**హైదరాబాద్, ఏప్రిల్ 14 ( నినాదం):**
తెలంగాణాకి చెందిన నలుగురు మావోయిస్టులు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని రాష్ట్ర పోలీస్ శాఖ వెల్లడించింది. కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియస్ గణపతి, పసునూరి అలియాస్ నరహరి అలియాస్ సంతోష్, స్టేట్ కమిటీ సభ్యులు జడే రత్నాబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు ఉన్నారని పోలీస్ శాఖ వివరించింది.సాయుధ పోరాటం విరమించి.. జనజీవన స్రవంతిలో కలవాలంటూ ఇప్పటికే మావోయిస్టులకు డీజీపీ పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణా ప్రభుత్వ లొంగుబాటుతోపాటు పునరావాస విధానం ద్వారా లభించే ప్రయోజనాలు పొందాలను మావోయిస్టులకు పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసిన విషయం విదితమే.మరోవైపు సోమవారం కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాల కూంబింగ్ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎల్‌ఓసీ కమాండర్ రూపీ రెడ్డి అలియాస్ రంగబోయిన భాగ్య (46) మరణించారు. సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం ఆమె స్వస్థలం. రెండు దశాబ్దాలుగా ఆమె అజ్ఞాతంలో ఉంటున్నారు. మూడు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా రూపీ రెడ్డి ఉన్నారు. ఆమెపై రూ. 5 లక్షల రివార్డు ఉంది. ఆమె మృతదేహానికి ఇప్పటికే పోస్ట్‌మార్టం పూర్తయింది. మంగళవారం సాయంత్రం ఈ మృతదేహం ఆమె స్వగ్రామానికి చేరుకోనుంది. బుధవారం రూపీ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## నాతవరంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు

అయ్యన్నపాత్రుడు కొనియాడారు. అయ్యన్నపాత్రుడు తన రాజకీయ గురువని, ఆయన ప్రోత్సాహంతోనే తాను ఈ స్థాయికి చేరానని హోం మంత్రి వంగలపూడి అనిత భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. సభాపతి అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో రాజధాని అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడం చారిత్రాత్మకమని తెలిపారు. గత ప్రభుత్వంలో దుర్వినియోగమైన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం.. దళితవాడల అభివృద్ధికి వినియోగిస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణాపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అమాయక గిరిజనులు ఈ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. నేరగాళ్లు, రౌడీ మూకలపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని, ఎన్డీపీఎస్ చట్టాన్ని మరింత కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాబోయే ఆరు నెలల్లో నర్సీపట్నం నియోజకవర్గంలో గంజాయి రవాణా, రౌడీయిజాన్ని పూర్తిగా అణచివేస్తామని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు.

## అంబేడ్కర్‌కు మోడీ నివాళులు

నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో అంబేడ్కర్ కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు బాబాసాహెబ్ జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు. దేశ నిర్మాణ దిశగా ఆయన చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకం. ఒక న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు ఆయన జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని ట్వీట్ చేశారు.మరోవైపు అంబేడ్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, తెలంగాణ సిఎం రేవంత్,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా వివిధ రాష్ట్రా ప్రముఖ నేతలు నివాళులు అర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అలాగే అంబేడ్కర్ వాదులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయన్ని గుర్తు చేసుకుంటున్నారు

## సజ్జనార్ ను కలిసిన మంగ్లీ..సుబ్బారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నపం

తమ్ముడు మోసాలకు పాల్పడ్డామన్న సుబ్బారావు ఆరోపణలను ఈ సందర్భంగా మంగ్లీ ఖండించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న సుబ్బారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే మోసపోయిన బాధితులకు న్యాయం చేసి అసలు దోషులను పట్టుకోవాలని కోరారు. గత నెల 22న సుబ్బారావు తనను కలిసి, సోషల్ మీడియాలో ఉన్న నెగెటివ్ వీడియోలను తొలగించాలంటే రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని మంగ్లీ ఆరోపించారు. అందుకు తాను నిరాకరించడంతోనే ఈ వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. తనకు పాటలు తప్ప వేరే వ్యాపారాలు లేవని, డబ్బుల కట్టలతో ఉన్న వీడియోలో ఉన్నది తన తమ్ముడు కాదని మంగ్లీ స్పష్టం చేశారు. ఒకవేళ తన తప్పు ఉందని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని సవాల్ విసిరారు. సుబ్బారావు కేవలం ఫేమస్ కావడానికే తన పేరును వాడుకుంటున్నారని మంగ్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, నిన్న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో బాధితులతో కలిసి హంగామా చేసిన సుబ్బారావుకు పోలీసులు బ్రీత్ అనలైజర్ టెస్ట్ నిర్వహించగా, 27 ఎంజీ రీడింగ్ వచ్చింది. మద్యం సేవించి స్టేషన్‌లో ఆయన ప్రవర్తించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## రేపు ఢిల్లీకి వెళుతున్న రేవంత్ రెడ్డి

జీఎస్‌డీపీకి 50 శాతం ప్రాధాన్యతనిస్తూ సీట్ల విభజన జరగాలన్న తన డిమాండ్‌పై 'ఇండియా' కూటమి నేతలతో ఆయన చర్చించనున్నారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి అంశాలపై జాతీయ స్థాయిలో ఇతర పార్టీలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ రూపొందించే అవకాశం ఉంది. మరోవైపు, తెలంగాణకు రావాల్సిన పెండింగ్ నిధులు, అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రులను కలిసి విన్నవించనున్నారు.

## ఇరాన్‌కు అణు ఆయుధాలు దక్కనివ్వం.. నావికా దిగ్బంధనం మొదలైంది

"ఇరాన్‌కు అణు ఆయుధాలు ఉండకూడదన్నదే మా ప్రధాన ఉద్దేశం. ఈ విషయంలో వాళ్లు అంగీకరించలేదు. కానీ, త్వరలోనే వారు అంగీకరిస్తారని నేను భావిస్తున్నాను. ఒకవేళ ఒప్పుకోకపోతే ఎలాంటి ఒప్పందం ఉండదు" అని ట్రంప్ అన్నారు. చర్చల కోసం ఇరాన్ తమను సంప్రదించిందని, ఒప్పందం చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆయన తెలిపారు. నావికా దిగ్బంధనం ఉదయం 10 గంటలకు ప్రారంభమైందని ట్రంప్ ధ్రువీకరించారు. "ప్రపంచాన్ని ఇరాన్ బ్లాక్‌మెయిల్ చేస్తోంది. దానిని మేము జరగనివ్వం. అందుకే ఈ చర్యలు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దిగ్బంధనం ఇరాన్‌ను చర్చల వైపు మళ్లించడంతో పాటు ప్రపంచ ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి కూడా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. హార్మూజ్ జలసంధిపై అమెరికా ఇంధన అవసరాల కోసం ఆధారపడటం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. "మాకు ఆ జలసంధి అవసరం లేదు. మాకు కావాల్సిన చమురు, గ్యాస్ మా వద్దే ఉన్నాయి. కానీ ప్రపంచానికి అది అవసరం" అని అన్నారు. ఇప్పటికే ఇరాన్ నావికాదళం, వాయుసేన, గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్ వ్యవస్థలు పూర్తిగా నాశనమయ్యాయని ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌కు పరిస్థితులు ఏమాత్రం ఆహ్లాదకరంగా ఉండవని ఆయన హెచ్చరించారు. ఈ దిగ్బంధనం అమలులో ఇతర దేశాలు కూడా తమకు సహకారం అందిస్తాయని ఆఫర్ చేశాయని, చైనా కూడా ఈ సమస్య పరిష్కారం కావాలని కోరుకుంటోందని ట్రంప్ వివరించారు.

## ముస్లింలను ఓట్ల కోసం వాడుకుని వదిలేయడం మమతాకు అలవాటు

"బెంగాల్‌లో బీజేపీని బలోపేతం చేసింది మమతా బెనర్జీనే. 1998, 1999లలో బీజేపీ పార్లమెంటులో తొలిసారి గెలవడానికి తృణమూల్ కాంగ్రెస్ సహకరించలేదా? ఆ తర్వాత మీరు రైల్వే మంత్రి అయ్యారు. గుజరాత్ అల్లర్లపై దేశమంతా వేలెత్తి చూపుతున్నప్పుడు కూడా మీరు ఎన్డీయే కేబినెట్‌లో మంత్రిగా కొనసాగారు. అలాంటి మీరు ఇప్పుడు నాపై వేలెత్తి చూపుతారా?" అని ఒవైసీ ప్రశ్నించారు. ముస్లింలను ఓట్లు వేసే పశువుల్లా చూస్తున్నారని, వారి కోసం మమత చేసిందేమీ లేదని ఆయన దుయ్యబట్టారు. ఇటీవల తృణమూల్ రెబల్ నేత హుమయూన్ కబీర్‌తో పొత్తు పెట్టుకోవడంపైనా ఒవైసీ స్పందించారు. బీజేపీ నేతలతో సంబంధాల గురించి హుమయూన్ మాట్లాడినట్టుగా ఉన్న ఒక 'స్టింగ్ వీడియో' బయటకు రావడంతో ఆయనతో పొత్తును రద్దు చేసుకున్నామని తెలిపారు. ఇప్పుడు హుమయూన్ తాను తృణమూల్‌తోనే ఉన్నానని చెబుతున్నారని, తన పరిస్థితిని లైలా కోసం ఎదురుచూసే వ్యక్తిలా మార్చారని ఒవైసీ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగానే పోటీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## నియోజకవర్గాల పునర్విభజన... 543 నుంచి 850కి పెరగనున్న లోక్ సభ స్థానాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 ( నినాదం):**
నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ప్రకారం, లోక్ సభ సీట్లు 543 నుంచి 850కు పెరిగే అవకాశం ఉంది. ఈ నెల 16న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారం ఇచ్చింది. బిల్లులకు సంబంధించిన ప్రతులను పంపించింది.పునర్విభజన బిల్లు ప్రకారం రాష్ట్రాల్లో 815 వరకు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశముంది. దీనితో లోక్ సభ స్థానాలు 543 నుంచి 850కి చేరవచ్చని అంచనా ఉంది. లోక్ సభలో బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసి సీట్ల పెంపు కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేసి 2029 ఎన్నికల్లో అమలు చేయాలని భావిస్తోంది.సీట్ల పెంపు తర్వాత దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయి. జనగణన తర్వాత వచ్చిన లెక్కల ఆధారంగా రిజర్వేషన్ ఉంటుంది. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్ సభ, అసెంబ్లీ సీట్లను 50 శాతం పెంచాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

EVENING 6PM

03

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం ఏప్రిల్ 14 2026

ninadam.in

డిజిటల్ ఎడిషన్


### ఏపీలో తిరిగే తెలంగాణ ఆర్టీసీ బస్సుల

# ఛార్జీలు తగ్గింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (నినాదం):** ఏపీ ఆర్టీసీ ప్రయాణికులకు ఒకేసారి రెండు శుభవార్తలు అందించింది. రాష్ట్రంలో రాకపోకలు సాగించే తెలంగాణ ఆర్టీసీ (టీజీఎస్ఆర్టీసీ) బస్సుల్లో ఛార్జీలను ఏపీఎస్ఆర్టీసీతో సమానం చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అదే సమయంలో ఏపీలో తిరిగే బస్సుల్లో వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే... ఏపీలో తిరిగే తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటివరకు ఏపీఎస్ఆర్టీసీ బస్సుల కంటే ఛార్జీలు ఎక్కువగా ఉండేవి. ప్రయాణించే దూరాన్ని బట్టి ఈ వ్యత్యాసం రూ.20 నుంచి రూ.130 వరకు అదనంగా ఉండేది. దీనివల్ల ప్రయాణికులు కొంత ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తూ, తాజాగా టీజీఎస్ఆర్టీసీ బస్సు ఛార్జీలను ఏపీఎస్ఆర్టీసీ ఛార్జీలతో సమానంగా సవరించినట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ టి. దేవరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల మధ్య బస్సు ప్రయాణం మరింత సులభతరం కానుంది. మరోవైపు ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వృద్ధులు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వారి కోసం ప్రత్యేకంగా కేటాయించిన సీట్లలో వారే కూర్చునేలా చూడాలని బస్సు సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గత కొంతకాలంగా ఈ రిజర్వ్‌డ్ సీట్లలో ఇతరులు కూర్చోవడం వల్ల అర్హులైన వారికి అసౌకర్యం కలుగుతోందంటూ పలు ఫిర్యాదులు అందాయి.

ఈ నేపథ్యంలో స్పందించిన ఉన్నతాధికారులు, అన్‌రిజర్వ్‌డ్ బస్సుల్లో వృద్ధులు, దివ్యాంగుల కోసం కేటాయించిన సీట్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. ఒకవేళ ఆ సీట్లలో ఇతరులు కూర్చుని ఉంటే, వారిని సున్నితంగా ఒప్పించి ఖాళీ చేయించి, వృద్ధులు లేదా దివ్యాంగులకు కేటాయించాలని డ్రైవర్లు, కండక్టర్లకు స్పష్టం చేశారు. ఈ రెండు నిర్ణయాలు ప్రయాణికుల సంక్షేమం పట్ల ఆర్టీసీ యాజమాన్యం చూపిస్తున్న శ్రద్ధకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# దేశంలో ఇస్లామిక్ రాజ్యం కోసం కుట్ర.. ఏపీ ఉగ్ర కేసులో బయటపడ్డ షాకింగ్ నిజాలు!



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 ( నినాదం):** భారత దేశాన్ని ఇస్లామిక్ రాజ్యంగా మార్చడమే తమ లక్ష్యమని, ఇందుకోసం 'గజ్వా-ఏ-హింద్' (భారత్‌పై యుద్ధం) ప్రారంభించామని విజయవాడ ఉగ్రలింకుల కేసులో అరెస్టయిన నిందితులు వెల్లడించినట్లు తెలుస్తోంది. ఆల్ ఖైదా, ఐసిస్ వంటి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కొనసాగిస్తున్నామని, ఈ మార్గాన్ని తమకు ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన అల్ హకీం షుకూర్ చూపించాడని వారు పోలీసు కస్టడీలో సంచలన విషయాలు చెప్పినట్టు సమాచారం. పోలీసుల విచారణలో నిందితులు మరిన్ని కీలక వివరాలు వెల్లడించారు. "భారత జాతీయ జెండా స్థానంలో ఐసిస్ జెండాను ఎగురవేయాలని, 'ఏ నేషన్ లెడ్ బై మహమ్మద్ విల్ నాట్ సరెండర్' వంటి నినాదాలతో యువతలో ఉగ్రవాద భావజాలాన్ని నింపేందుకు ప్రయత్నించాం. ఇస్లాంను విశ్వసించని వారిపై సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేశాం. జిహాద్ కోసం ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్నవారిని గుర్తించే పనిని షుకూర్ మాకు అప్పగించాడు. దేశంలోని స్లీపర్ సెల్స్‌తో త్వరలో పరిచయం చేస్తానని చెప్పాడు. కానీ, అంతలోనే మేం అరెస్టయ్యాం. ఇప్పటివరకు మేం అతన్ని చూడలేదు, ఎక్కడుంటాడో కూడా మాకు తెలియదు" అని నిందితులు చెప్పినట్లు తెలిసింది.

### దేశవ్యాప్తంగా విస్తరించిన నెట్‌వర్క్

సోషల్ మీడియా ద్వారా యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించి, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌లకు పంపి మిలిటెంట్ శిక్షణ ఇప్పించాలని అల్ హకీం షుకూర్ కుట్ర పన్నాడు. ఇందుకోసం 'బెన్ ఎక్స్ డాట్ కామ్' పేరుతో సోషల్ గ్రూపును ఏర్పాటు చేసి, దేశంలోని పలు రాష్ట్రాల యువతకు గాలం వేశాడు. ఈ దేశ వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచిన ఏపీ ఇంటెలిజెన్స్ అధికారులు గత నెలలో విజయవాడకు చెందిన మహమ్మద్ డానిష్, మహమ్మద్ రహంతుల్లా షరీఫ్, మీర్జా సోహైల్ బేగ్‌లను అరెస్టు చేయడంతో ఈ నెట్‌వర్క్ గుట్టురట్టయింది. వీరిచ్చిన సమాచారంతో హైదరాబాద్‌కు చెందిన సైదా బేగం, బళ్లారికి చెందిన అబ్దుల్ సలామ్, పాట్నాకు చెందిన షాద్మాన్ దిల్‌ఖష సహా ఏడు రాష్ట్రాల్లో 11 మందిని అరెస్టు చేశారు. తాజాగా ఏపీ సీఐడీ అధికారులు షాద్మాన్ దిల్‌ఖష్‌తో పాటు మరో ఆరుగురిని కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ ముగియడంతో సోమవారం వారిని కోర్టులో హాజరుపరిచి, రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ విచారణలో మరో నాలుగు రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్ లింకులు ఉన్నట్లు, కీలకంగా వ్యవహరిస్తున్న 42 మంది వివరాలను అధికారులు గుర్తించారు. వీరిలో కొందరికి 25 నుంచి 40 వరకు వేర్వేరు పేర్లతో సోషల్ మీడియా ఖాతాలు ఉన్నట్లు కనుగొన్నారు.

### రంగంలోకి దిగిన ఎన్ఐఏ

ఈ కేసు తీవ్రత దృష్ట్యా, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రంగంలోకి దిగింది. ఇప్పటికే ఏపీ పోలీసులకు సహకారం అందిస్తున్న ఎన్ఐఏ, త్వరలోనే ఈ కేసును పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని దర్యాప్తు చేయనున్నట్లు సమాచారం.

### భోగాపురం విమానాశ్రయానికి ఆర్టీసీ ఏసీ బస్సులు..

# ఈ మూడు నగరాల నుంచి సర్వీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (నినాదం):** విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే 98 శాతం పనులు పూర్తి కాగా, జూన్ నెలాఖరు నాటికి మిగిలిన పనులు పూర్తి చేసి జులై లేదా ఆగస్టు నెలలో దీనిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రతిష్మాత్మక విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంపై అధికారులు దృష్టి సారించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. విమానాశ్రయానికి చేరుకునే ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ప్రయాణికుల రద్దీని అంచనా వేసేందుకు ఆర్టీసీ రీజినల్, జోనల్ మేనేజర్లు ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు. తొలి దశలో 20 నుంచి 30 బస్సులను నడిపి, ఆదరణను బట్టి వాటి సంఖ్యను పెంచాలని భావిస్తున్నారు. విశాఖ నుంచి 20 బస్సులను నడపాలని ఎయిర్‌లైన్స్ సంస్థల నుంచి కూడా ప్రతిపాదనలు వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు విమానాశ్రయానికి మెట్రో రైలు సేవలను అనుసంధానం చేయాలనే డిమాండ్ కూడా తెరపైకి వచ్చింది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ మేరకు మెట్రో రైల్ ఎండీ రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం కొమ్మాది వరకు ప్రతిపాదించిన మెట్రోను భోగాపురం వరకు పొడిగిస్తే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. రుషికొండలో ఐటీ సంస్థలు అభివృద్ధి చెందుతున్నందున, అటువైపు కూడా మెట్రోను విస్తరించాలని కోరారు.




విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానించేందుకు జులై 5, 8 లేదా ఆగస్టు 17, 19 తేదీల్లో ఆయన సమయం కోరినట్టు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై స్పష్టత రానుంది. మొత్తంగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభానికి ముందే రవాణా సౌకర్యాలను సిద్ధం చేసేందుకు అన్ని శాఖలు సమాయత్తమవుతున్నాయి.



## మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల తిరుపతి పర్యటన

**అమరావతి, ఏప్రిల్ 14 ( నినాదం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి వెళుతున్నారు. ఈరోజు రాత్రి ఆయన రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో తిరుపతిలోని ఎస్.వి. ఆటోనగర్ సమీపంలో ఉన్న ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు. తన పర్యటనలో భాగంగా రేపు ఉదయం మొదటగా సుమారు రూ.10.20 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత చంద్రగిరి నియోజకవర్గానికి బయలుదేరి వెళ్తారు. అక్కడ స్థానిక బాలుర కళాశాల ప్రాంగణంలో రూ.3.20 కోట్లతో నూతనంగా నిర్మించిన నారా రామ్మూర్తి నాయుడు క్రీడా ప్రాంగణాన్ని, ఇండోర్ స్టేడియంను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాల అనంతరం తిరిగి తిరుపతికి చేరుకుంటారు. తిరుపతి గ్రామీణ మండలం తనపల్లి కూడలి వద్ద ఉన్న రామానాయుడు గార్డెన్స్‌లో నిర్వహించే పార్టీ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ పాల్గొని ప్రసంగిస్తారు.



## బీఆర్ అంబేడ్కర్‌కు ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఘన నివాళులు

**అమరావతి, ఏప్రిల్ 14 ( నినాదం):** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రముఖులు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా బాబాసాహెబ్‌ను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నివాళి అర్పిస్తూ.. అంటరానితనాన్ని ఎదుర్కొని ఉన్నత స్థాయికి ఎదిగిన అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని కొనియాడారు. "ప్రపంచంలోనే బలమైన ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలుస్తోందంటే దానికి కారణం ఆయన మనకిచ్చిన రాజ్యాంగమే. అంబేడ్కర్ ఆశయ సాధనే మన లక్ష్యం కావాలి. ప్రజాస్వామ్యాన్ని గౌరవించడమే ఆ మహనీయునికి మనం ఇచ్చే ఘన నివాళి" అని చంద్రబాబు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ కూడా అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. "పేద, బడుగు బలహీనవర్గాల శ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్. భారత రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది" అని అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.



### కార్లు, బైకులపై భారతీయుల మోజు..

# మార్చి నెలలో అమ్మకాల జోరు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 ( నినాదం):** భారత ఆటోమొబైల్ రంగం మార్చి నెలలో బలమైన వృద్ధిని నమోదు చేసింది. ముఖ్యంగా ప్యాసింజర్ వాహనాల (కార్లు) విక్రయాలు గతేడాదితో పోలిస్తే 16 శాతం పెరిగాయి. ఈ మేరకు సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) మంగళవారం గణాంకాలను విడుదల చేసింది. సియామ్ నివేదిక ప్రకారం, గత ఏడాది మార్చిలో 3,81,358 యూనిట్లుగా ఉన్న ప్యాసింజర్ వాహనాల విక్రయాలు, ఈ ఏడాది మార్చిలో 4,42,460 యూనిట్లకు చేరాయి. మార్కెట్లో పెరిగిన డిమాండ్, డీలర్‌షిప్‌ల వద్ద ఇన్వెంటరీ పెరగడం ఇందుకు ప్రధాన కారణమని సియామ్ పేర్కొంది. ఇదే సమయంలో ద్విచక్ర వాహనాల విక్రయాలు కూడా 19.3 శాతం పెరిగి 19,76,128 యూనిట్లకు, త్రీవీలర్ల విక్రయాలు 21.4 శాతం పెరిగి 76,273 యూనిట్లకు చేరాయి. ఈ వృద్ధి ధోరణి ఫిబ్రవరి నుంచి కొనసాగుతోంది. ఫిబ్రవరిలో కూడా వాహన విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 10.6 శాతం పెరిగాయి. పండుగల సీజన్, జీఎస్టీ రేట్ల తగ్గింపు, కొత్త మోడళ్ల రాక వంటి కారణాలతో 2026 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాల వృద్ధి 7 నుంచి 9 శాతం మధ్య ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, 2027 ఆర్థిక సంవత్సరంలో మాత్రం అధిక బేస్ ఎఫెక్ట్, మారుతున్న ఆర్థిక పరిస్థితుల కారణంగా వృద్ధి రేటు 4 నుంచి 6 శాతానికి పరిమితం కావొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం మొత్తం ప్యాసింజర్ వాహన విక్రయాల్లో యుటిలిటీ వాహనాల (యూవీ) వాటా 67 శాతానికి చేరడం గమనార్హం. దీంతోపాటు సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలకు కూడా ఆదరణ పెరుగుతోందని నివేదిక స్పష్టం చేసింది.

### నోయిడా అల్లర్ల వెనక

# పాక్ హస్తం

- అల్లర్లకు పాల్పడ్డ 300 మంది కార్మికుల అరెస్టు
- యూపి కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ వెల్లడి



**లక్నో, ఏప్రిల్ 14 ( నినాదం):** నోయిడాలోని పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలకు పాల్పడిన 300 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. మరో 100 మందిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. వేతనాల పెంపు, 8 గంటల పని కోసం సోమవారం కార్మికులు చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారింది. నోయిడాలోని ఫేజ్-2, సెక్టార్ 60, సెక్టార్ 62, సెక్టార్ 84 సహా పలు ప్రాంతాల్లో కార్మికులు ఆందోళనకు దిగారు. పలు వాహనాలను తగులపెట్టి.. భద్రతా సిబ్బందిపై రాళ్లు రువ్వారు. జాతీయ రహదారి -9 సహా పలు రోడ్లను దిగ్బంధించారు. దీంతో నోయిడా- ఢిల్లీ సరిహద్దుల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తెంది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువులు సైతం ప్రయోగించారు. అయితే, కార్మికుల హింసాత్మక ఘటనలపై ఉత్తర ప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ స్పందించారు. దాడిని పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హింసగా అభివర్ణించారు. పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై ఇటీవల నోయిడా, మీరట్‌లలో నలుగురు అనుమానితులు అరెస్టయిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. నిన్నటి దాడికి పాకిస్థాన్‌తో సంబంధం ఉందేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఆ కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు. అస్థిరతను సృష్టించే ఉద్దేశంతోనే ఈ ఘటన జరిగి ఉండొచ్చని ప్రాథమిక విచారణలో తేలిందని మంత్రి రాజ్‌భర్ చెప్పారు. రాష్ట్రంలో అస్థిరతను సృష్టించేందుకు దేశ వ్యతిరేక శక్తులు ప్రయత్నిస్తున్నాయని మంత్రి ఆరోపించారు. ముజఫర్‌నగర్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కార్యక్రమానికి అంతరాయం కలిగించే కుట్రలో భాగంగానే ఈ అల్లర్లు జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కార్మికులు ప్రశాంతంగా ఉండాలని, రెచ్చగొట్టే చర్యలకు, తప్పుడు సమాచారానికి ప్రభావితం కాకూడదని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలు వినేందుకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు నోయిడాకు చేరుకుని కార్మికులతో సంప్రదింపులు జరుపుతున్నారని మంత్రి రాజ్ భర్ తెలిపారు.



### నిప్పుల కొలిమిలా ఏపీ.. పలు ప్రాంతాల్లో

# 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (నినాదం):** ఏపీలో సూర్యుడు ప్రతాపం చూపిస్తుండటంతో రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఇవాళ కూడా రాయలసీమ, కోస్తా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా 33 మండలాల్లో తీవ్రమైన వడగాల్పులు, మరో 44 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది. విపత్తుల నిర్వహణ సంస్థ నివేదిక ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లాలో 15, విజయనగరం జిల్లాలో 9, శ్రీకాకుళంలో 4, పోలవరంలో 3, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1, ఏలూరు జిల్లాలోని ఒక మండలంలో తీవ్ర వడగాలుల ప్రభావం ఉండనుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలను విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. అత్యధికంగా కడపలో 44.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. నంద్యాల జిల్లా సంజామలలో 44 డిగ్రీలు, తిరుపతి జిల్లా వరదయ్యపాళెంలో 43.8, మార్కాపురం జిల్లా అనుమలపల్లిలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కర్నూలు జిల్లా గూడూరులో 43, పల్నాడు జిల్లా దుర్గిలో 42.8, అనంతపురం జిల్లా రాయదుర్గంలో 42.7, నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 42.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనట్లు సంస్థ పేర్కొంది. ఎండ తీవ్రత, ఉక్కపోత దృష్ట్యా ప్రజలు వీలైనంత వరకు ఇళ్లకే పరిమితం కావాలని అధికారులు కోరుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి తప్పనిసరిగా వాడాలని, డీహైడ్రేషన్ బారిన పడకుండా తరచుగా నీళ్లు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6PM

04

డిజిటల్

మంగళవారం ఏప్రిల్ 14 2026

ninadam.in






## బీహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి

**బీహార్ ఏప్రిల్ 14 (నినాదం):** బీహార్ తదుపరి ముఖ్యమంత్రిగా బీజేపీ నాయకుడు సామ్రాట్ చౌదరి రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈరోజు నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీజేపీ శాసనసభా పక్షం సామ్రాట్ చౌదరిని తమ పార్టీ నేతగా ఎన్నుకుంది. దీనితో ఆయన రేపు ప్రమాణం చేయనున్నారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ ఎన్నిక కోసం పరిశీలకుడిగా వచ్చారు. 1990లో ఆర్జేడీలో సామ్రాట్ చౌదరి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1999లో వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత ఆయన జేడీయూలో చేరారు. అనంతరం ఆయన బీజేపీలో చేరగా, కొన్నాళ్లకే 2018లో బీహార్ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2023 మార్చిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు. ఇప్పుడు బీహార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మొదటి బీజేపీ నేతగా ఆయన నిలవనున్నారు. ఆయన కుష్వాహా వర్గానికి చెందిన నాయకుడు. బీహార్‌లో యాదవుల తర్వాత కుష్వాహాల ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. బీహార్‌లో ఇప్పటి వరకు ఈ వర్గానికి చెందిన నాయకుడికి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం రాలేదు. సామ్రాట్ చౌదరిని పెద్ద నాయకుడిగా చేస్తానని బీహార్ ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ క్రమంలో తొలుత ఉపముఖ్యమంత్రిగా చేశారు. రేపు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

### కరవు ఏర్పడితే దానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం - జీవన్ రెడ్డి

**జగిత్యాల, ఏప్రిల్ 14(నినాదం):** తెలంగాణలో భవిష్యత్తులో కరవు పరిస్థితులు ఏర్పడితే దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి హెచ్చరించారు. జగిత్యాలలో బీఆర్ఎస్ నేత హరిచరణ్ రావు నివాసంలో జరిగిన భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రాణహిత జలాల వినియోగానికి తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుత సాగునీటి అవసరాలకు మేడిగడ్డ ప్రాజెక్టును తక్షణమే పునరుద్ధరించడం ఒక్కటే మార్గమని సూచించారు. ఇప్పటికే మూడు వ్యవసాయ సీజన్లు గడిచిపోయాయని, జాప్యం చేస్తే రైతులకు తీరని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణానికి కేసీఆర్ స్ఫూర్తిప్రదాత అని, మేడిగడ్డలో చిన్న సాంకేతిక లోపాన్ని అడ్డం పెట్టుకుని ఆయనను దోషిగా చిత్రీకరించడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేడిగడ్డ పనులు పూర్తి చేయకపోతే రాబోయే కరవుకు కాంగ్రెస్ పార్టీయే జవాబుదారీ కావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



## 70 నియోజకవర్గాల్లో సమీకృత గురుకుల పాఠశాలలకు శ్రీకారం చుట్టాం

### - పొంగులేటి



**సత్తుపల్లి ఏప్రిల్ 14 (నినాదం):** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం, కల్లూరు మండలం చెన్నూరులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మొదటి విడతలో 70 నియోజకవర్గాల్లో రూ. 200 కోట్లతో ఈ సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు కేవలం శిలాఫలకాలకే పరిమితం కాకుండా, నిర్ణీత సమయంలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కల్లూరును ప్రత్యేక నియోజకవర్గంగా మార్చడం అనేది కేంద్ర ప్రభుత్వం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన సమీకరణలపై ఆధారపడి ఉంటుందని వివరించారు. సత్తుపల్లి ప్రాంతంలో మూడు పెద్ద ఆసుపత్రులు ఏర్పాటు చేయబోతున్నామని, పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఆర్థిక సవాళ్లు ఎదురైనా రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 బోనస్ వంటి పథకాలకు, విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్ అనుదీప్, అడిషనల్ కలెక్టర్ శ్రీజతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## భారత ప్రజాస్వామ్య పటిష్టతకు అంబేడ్కర్ కృషి

- ఆయన రాజ్యాంగంతో ఐక్యంగా దేశం అభివృద్ధి
- జయంతి వేడుకల్లో మాజీమంత్రి హరీష్ రావు



**సిద్దిపేట,ఏప్రిల్14 (నినాదం ):** ప్రపంచంలోనే భారత్ అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా ఉందంటే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తి వల్లేనని ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు ముక్కలవుతున్నాయని, అంతర్గత యుద్దాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భారతదేశంలో 28 రాష్ట్రాలు ఉన్నా దేశం ఒక్కటిగా వర్ధిల్లుతుందన్నారు. అందుకు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సిద్దిపేట రూరల్ మండలం తడకపల్లిలో బాబాసాహెబ్ విగ్రహాన్ని హరీశ్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కొందరివాడు కాదని.. అందరి వాడని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ..'చాలా దేశాలు విడిపోతున్నాయి. అంతర్యుద్ధాలతో సతమతమవుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా దేశం ఒక్కటిగానే ఉంది. అందుకు అంబేడ్కర్ మహానుభావుడే కారణం. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలకు ఓటు హక్కు రావడానికి చాలా దశాబ్దాలు పట్టింది. కానీ, మన రాజ్యాంగంలో మహిళలు, పురుషులు, కోటీశ్వరులు, పేదవారనే తేడా లేకుండా అంబేడ్కర్ అందరికీ ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్య స్ఫూర్తికి నాంది పలికారని గుర్తు చేశారు. ఆయన చాలా పేద కుటుంబంలో జన్మించారు. యువత బాబాసాహెబ్‌ను చూసి స్ఫూర్తి పొందాలి. అణగారిన వర్గాల కోసం ఆయన కృషి చేశారు. దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకాన్ని మాజీ సీఎం కేసీఆర్ తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ డిక్లరేషన్ పెట్టి రెండున్నర ఏళ్లయినా ఒక్క హామీ అమలు చేయలేదు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వక మధ్యలోనే చదువులు ఆగిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్‌ను డమ్మీ చేశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ఆగిపోయింది. సెక్రటేరియట్‌కి అంబేడ్కర్ పేరు పెట్టాం. దేశంలో ఏ రాష్ట్రం అలా చేయలేదు. అంబేడ్కర్ ఆలోచనతోనే తెలంగాణ వచ్చింది. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని కేసీఆర్ పెట్టారని రేవంత్ రెడ్డి ఆ విగ్రహానికి కనీసం పూలమాల కూడా వేయడం లేదని అన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### - బిశ్రీరాంపూర్ సిఐ అశోక్

**మంచిర్యాల, ఏప్రిల్ 14 (నినాదం):** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీరాంపూర్ సీఐ అశోక్ పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ లోని ప్రతి స్టేడియంలో అంబేద్కర్ సంఘం ఏర్పాటు చేసిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని చిన్న నిర్లక్ష్యం నిండు జీవితాన్ని బలిచేస్తుందన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాల పాలై కుటుంబాలను రోడ్డు పాలు చేసుకోవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెంట్, సీటు బెల్ట్ ధరించాలని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నపడకూడదని పేర్కొన్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ప్రమాదాలకు కారణం అని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ మాట్లాడరాదని సూచించారు. లారీ డ్రైవర్లు సుదూర ప్రాంతాలకు ప్రయాణించినప్పుడు మధ్యలో కొంతసేపు సేదా తీరాలని పేర్కొన్నారు. రోజంతా డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం అని తెలిపారు. లైసెన్స్ లు లేకుండా వాహనలు నడిపితే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్, కార్పొరేటర్ లు వేల్పుల రవీందర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్



**మంచిర్యాల, ఏప్రిల్ 14(నినాదం):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ సేవలు అందరికీ ఆదర్శం అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్ రావు పేర్కొన్నారు. మంగళవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నస్పూర్లో విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని పేర్కొన్నారు. భారతదేశం లో సమ సమాజ నిర్మాణానికి అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే స్ఫూర్తి అని పేర్కొన్నారు. సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపి అణగారిన వర్గాల ప్రయోజనాలు కాపాడడంలో ఎంతో కృషి చేశాడని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ రచించకుండా ఉంటే రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలు బడుగు బలహీన వర్గాలకు అందేవి కావని పేర్కొన్నారు. రిజర్వేషన్లు కల్పించడంతో విద్యా రాజకీయ వైద్య , అనేక రంగాల్లో చాలామంది రాణిస్తున్నారు అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య,4వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్, నాయకులు వంగ తిరుపతి, మెరుగు పవన్, కాటంరాజు, అహ్మద్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుడికి ఘన నివాళులు

### - జిల్లాలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**భూపాలపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 14 (నినాదం ):** రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని ఆయా మండలాల్లో అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు అంబేద్కర్ సంఘాలు, ప్రజా సంఘాలు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. అంబేద్కర్ వల్లనే అన్ని కులాలకు సమన్యాయం లభిస్తుందని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పీ నరేష్ కుమార్, పలు సంఘాల నాయకులు అంబేద్కర్ వాదులు పాల్గొన్నారు.

## అడ్డంగా నరుకుతామన్న ఎమ్మెల్యే వ్యాఖ్యలపై శ్రీధర్ బాబు వివరణ

**మంథని ఏప్రిల్ 14(నినాదం):** రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారం రేపాయి. మంథనిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ కార్యకర్తలను ఎవరైనా బెదిరిస్తే “అడ్డంగా నరుకుతాం“ అంటూ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఈ వివాదంపై స్పందిస్తూ వివరణ ఇచ్చారు. రాజ్ ఠాకూర్ శాంతిని కోరుకునే వ్యక్తి అని, ప్రస్తుతం కాంగ్రెస్ కార్యకర్తలను చాలా మంది బెదిరిస్తుండటంతో వారికి ధైర్యం చెప్పే క్రమంలోనే ఆయన ఆవేశంగా మాట్లాడారని మంత్రి సమర్థించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కార్యకర్తలు తమ బాధలు చెప్పుకున్నప్పుడు వారిలో భరోసా నింపేందుకు అలా స్పందించాల్సి వచ్చిందని తెలిపారు. శాంతికి విఘాతం కలిగించే ఆలోచనలు ఎవరు చేసినా తమ ప్రభుత్వం ఖండిస్తుందని, చట్టాన్ని అతిక్రమించే ఉద్దేశం ఎవరికీ లేదని మంత్రి స్పష్టం చేశారు.



### అసలేం జరిగిందంటే?..

మంథనిలో జరిగిన ఒక సమావేశంలో రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. “మంథనిలో ప్రతిరోజూ శ్రీధర్ బాబు ఉండకపోవచ్చు. కానీ కార్యకర్తలను ఎవరైనా బెదిరిస్తే మేము 2 గంటల్లో ఇక్కడికి వస్తాం. ఎవరైనా అడ్డంగా మాట్లాడితే వారిని అడ్డంగా నరుకుతాం“ అని వ్యాఖ్యానించారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి హింసాత్మక వ్యాఖ్యలు చేయడం సరికాదంటూ విపక్షాలు మండిపడుతున్నాయి.

### 'రైతులు ప్యాడీ క్లీనర్లను సద్వినియోగం చేసుకోవాలి'

**మునుగోడు, ఏప్రిల్ 14 (నినాదం ):** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లను రైతులు సద్వినియోగ పరచుకోవాలని, తద్వారా మిల్లులకు నాణ్యతతో కూడిన ధాన్యం చేరుతుందని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ అన్నారు. మంగళవారం ఆయన మునుగోడులో మల్లికార్జున రైస్ మిల్లులో ధాన్యం సేకరణ కేంద్రాల భాద్యులతో మాట్లాడారు. వడ్ల సేకరణ ఓ యజ్ఞం వంటిదని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ధాన్యంలో తేమ, తాలు శాతం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## అంబేద్కర్ ఆశయాలు సమానత్వ సమాజానికి పునాది

### - యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి



**సిద్దిపేట ఏప్రిల్ 14(నినాదం):** చిన్న కోడూరు మండలం అల్లిపుర్ గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రముఖ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే మహత్తర విలువలకు బలమైన పునాది వేసిన మహానుభావుడని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి యుగయుగాల పాటు నిలిచిపోతుందని అన్నారు. అంబేద్కర్ ఆశయాలు సమాన హక్కులు కలిగిన సమాజ నిర్మాణానికి మార్గదర్శకమని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు